క్లుప్తంగా

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

చిట్యాల: నూతన తహసీల్దార్‌గా ఎండీ. ఖాజా మొహియొద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పదిహేను రోజుల క్రితం అదిలాబాద్ జిల్లా నుంచి చిట్యాలకు వచ్చిన తహసీల్దార్ ప్రహ్లద్ తిరిగి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలానికి బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్ ఖాజా మొహియొద్దీన్ ఏటూర్‌నాగారం నుంచి చిట్యాలకు బదిలీపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ శివతేజ్, ఆర్‌ఐ రాజు, ఏఎస్‌ఓ సాయికిరణ్, సీనియర్ అసిస్టెంట్ సాయి జయంత్, సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లద్‌రాథోడ్

మహదేవపూర్: నూతన తహసీల్దార్‌గా ప్రహ్లద్ రాథోడ్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తహసీల్దార్ల బదిలీల్లో బాగంగా కొమురంభీం జిల్లా తిర్యాని తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రహ్లద్ రాథోడ్‌ను మహదేవపూర్‌కు బదిలీ చేశారు.

వెంకటాపురం(కె): తహసీల్దార్‌గా వీరభద్ర ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సదానందంను అధికారులు వెంకటాపూర్(ఎం) మండలానికి బదిలీ చేయడంతో ఆయన స్థానంలో వీరభద్ర ప్రసాద్‌ను తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. కాగా వీరభద్రప్రసాద్ విధుల్లో చేరారు.

ఫొటోగ్రఫీలో శ్రావణ్‌కు అవార్డు



వెంకటాపురం(ఎం): ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లో లలిత కళా అకాడమీ నిర్వహించిన మేళా మూమెంట్స్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌లో మండలంలోని పాలంపేట గ్రామానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ తడాండ్ల శ్రావణ్ (మేళా వైబ్స్ విభాగంలో) ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు. విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి మీనాక్షి లేఖి చేతుల మీదుగా శ్రావణ్ అవార్డును అందుకున్నాడు.

వాహనాల తనిఖీ



వాజేడు: మండలంలో పోలీసులు వాహన తనిఖీలను శుక్రవారం ముమ్మరంగా చేశారు. స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు చెరుకూరు గ్రామం వద్ద 163 నంబర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా పేరూరు ఎస్సై రమేష్ కృష్ణాపురం గ్రామం జాతీయ రహదారిపై వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రతీ వాహనాన్ని సోదా చేయడంతో పాటు ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రిక్షా కార్మికుడికి తీవ్ర గాయాలు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని దుంపెల్లిగూడేనికి వెళ్లే దారిలో శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో గోవిందరావుపేట గ్రామానికి చెందిన రిక్షా కార్మికుడు కొంతం సాంబయ్యను గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాంబయ్య తలకు తీవ్ర గాయాలు కాగా ములుగులోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. సాంబయ్య మండల కేంద్రంలో రిక్షా తొక్కుతూ జీవనం కొనసాగిస్తున్నాడన్నారు. బయటికి వెళ్లి వచ్చే మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన నాయకులు

కాటారం: మేడిగడ్డ సందర్శనకు వెళ్తున్న మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు కాటారం ప్రధాన కూడలిలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేశ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభివాదం తెలుపుతూ ముందుకు కదిలారు.

రెండు ఉద్యోగాలు సాధించిన రాజమౌళి

రేగొండ: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన కొంగొండ లక్ష్మి–ఐలుకొమురయ్య దంపతుల పుత్రుడు రాజమౌళికి ఇటీవల విడుదలైన గురుకుల జేఎల్ రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు, అలాగే పీజీటీ ఫలితాల్లో ఇంగ్లీష్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 22వ ర్యాంకును సాధించి అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. వివిధ కళాశాలలో పని చేస్తున్న రాజమౌళి ప్రస్తుతం కరీంనగర్‌లోని నారాయణ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలు రావడంతో అతని తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభతోనే తగిన గుర్తింపు

- పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్



శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏటూరునాగారం: ప్రతిభతోనే తగిన గుర్తింపు లభిస్తోందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యడ సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం, గైడ్ టీచర్ శ్యాంసుందర్‌రెడ్డిని శుక్రవారం ఆ పాఠశాల ఆవరణలో పీఆర్‌టీయూ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ రామన్నగూడెం పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల విజయవాడలో 35వ సౌత్ ఇండియా సైన్స్ ఫెస్టివల్ కార్యక్రమానికి వెళ్లి జాతీయ స్థాయికి ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సురేందర్ తెలిపారు. శ్యాంసుందర్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేశారన్నారు. 9వ తరగతికి చెందిన మైథిలీ, రక్షిత మంచి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. హెచ్ఎం కొయ్యడ మల్లయ్య, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రౌతు రాజు, వెంకటరమణ, సూర్యనారాయణ, రమాదేవి, రాంబాబు, వెంకట్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

రేగొండ: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 151 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తుంద ని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మీ, తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, వీరభద్రం, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ రజాక్, ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, బొట్ల కవిత, శనిగరపు వెంకన్న, గంట గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యుడు చిరుపోతుల రాజు భార్య రమ అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రాష్ట్రస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మల్హర్: ఈనెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల సభకు ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడంపై టీయూఎఫ్ ఫోరం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి, మల్హర్ మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్, చొప్పరి రాజు, షేక్ చాంద్ పాషా, గణేష్, నగేష్, సారయ్య, కిష్టయ్య, యశోద, శంకరయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల: మండలంలోని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సంఘం సభ్యుడు బొల్లికొండ వెంకటేష్ తండ్రి మల్లయ్య దశదినకర్మలో సంఘం అధ్యక్షుడు దాసారపు సదానందం ఆధ్వర్యంలో సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి నిమ్మల దేవేందర్, గౌరవ అధ్యక్షుడు బండ రఘోత్తం రెడ్డి, ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి, సభ్యులు నాగేందర్, బుచ్చన్న, లింగమూర్తి, కుమార్, సతీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



డీసీఓ శైలజకు అవిశ్వాస తీర్మానం కాపీ ఇస్తున్న డైరెక్టర్లు

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాష్‌రావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. వైస్ చైర్మన్‌పై ఆ సంఘం 9 మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానం కోరుతూ శుక్రవారం భూపాలపల్లి డీసీఓ శైలజకు సంతకాలు చేసిన పత్రాన్ని కొంతమంది డైరెక్టర్లు అందించారు. సొసైటీలో 13 మంది డైరెక్టర్లలో ప్రకాష్‌రావును సంఘం వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్న విషయం తెలిసిందే. కాగా ఓ డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందగా ప్రస్తుతం చైర్మన్‌తో కలిపి 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. అధికారులు అవిశ్వాసం తీర్మానం ప్రవేశ పెట్టిన తేదీ నాటికి 9 మంది డైరెక్టర్లు మద్దతు ప్రకటించాల్సి ఉంది. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, రాము, సురేష్‌లు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



కాటారం : మండలంలోని శంకరాంపల్లికి చెందిన ఉరకొండ ప్రశాంత్ అనారోగ్యం పాలవగా వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు ద్వారా సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేశారు. ప్రశాంత్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉన్నత వైద్యానికి డబ్బులు లేకపోవడంతో సీఎం సహాయ నిధి కోసం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2,10,000కు సంబంధించిన ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధితుడి కుటుంబానికి అందజేశారు. ఎల్‌ఓసీ మంజూరు చేయించి అండగా నిలిచిన మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

భూమిలేని నిరుపేదలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న అంబాల అనిల్‌కుమార్

చిట్యాల: జయశంకర్ జిల్లాలో భూమిలేని నిరుపేదలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విముక్తి చిరుతల పార్టీ (వీసీకే) జిల్లా అధ్యక్షుడు అంబాల అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చైన్‌పాక గ్రామంలో ఉన్న నిరుపేదల కుటుంబాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని వారందరికీ ప్రభుత్వ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలను ప్రభుత్వ అధికారులు సందర్శించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భూములను పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలి



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న విద్యార్థినులు

కాటారం: విద్యార్థులు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కలిగి వుండాలని ఎంఈఓ దేవానాయక్ అన్నారు. స్థానిక జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే అభ్యర్థులుగా, పోలింగ్ సిబ్బంది ఓటర్లుగా వ్యవహరించారు. నామినేషన్, ఓటింగ్ ప్రక్రియ, బ్యాలెట్ బాక్స్‌లు భద్రపర్చడం, కౌంటింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఓటు హక్కు వినియో గించుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాణి, ఉపాధ్యాయులు రజిత, షకీల్ అహ్మద్‌ఖాన్, పద్మజ, సుజాత, కవిత, సుధాకర్, పరంసింగ్, దివాకర్, సద్గుణ, సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత

రేగొండ: గర్భిణులు, బాలింతలు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సామాల సుజాత అన్నారు. శుక్రవారం కొడవటంచ సెక్టార్‌లోని రంగయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో అందించే అదనపు ఆహారం పాలు, గుడ్లు క్రమం తప్పకుండా బాలింతలు, గర్భిణులు తీసుకోవాలని కోరారు. ప్రతిరోజు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వరూప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అమరులకు ఎమ్మార్పీఎస్ నేతల ఘననివాళి



మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

ములుగు: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరులకు ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. మండల ఇన్‌చార్జ్‌లు కోతి కార్తీక్, దూడపాక రాజు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబుమాదిగ హాజరై అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీభవన్ దాడి ఘటనలో మార్చి 1న ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వర్గీకరణ సాధించినప్పుడే అమరులకు నిజమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మరాఠి రవీందర్‌మాదిగ, తోకల రాంబాబు, శ్రీను మాదిగ, గడ్డం కుమార్, సమ్మయ్య, సూరయ్య, రాంచందర్, ఆదం తదితరులు పాల్గొన్నారు.

డీటీఓను కలిసిన యూనియన్ సభ్యులు



డీటీఓ సిరాజ్ రెహ్మాన్‌ను సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

ములుగు: ములుగు డీటీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిరాజ్ రెహ్మాన్‌ను శుక్రవారం స్థానిక శ్రీ సమ్మక్క–సారలమ్మ కారు యూనియన్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మేకల సంజీవ, ఉపాధ్యక్షుడు బొమ్మగాని భాస్కర్, మాట్ల బద్రి, కోమల్‌రెడ్డి, రాంసింగ్, తరుణ్, రాజేందర్, రఘు, రాజేష్, అఫ్రోజ్, క్రాంతి, రేవంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ లక్ష్మారెడ్డి

మహదేవపూర్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను మండల ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ లక్ష్మారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులతో బ్యాంకు అందిస్తున్న సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు పంటరుణాలు, గోల్డ్ లోన్లు, గ్రూపు లోన్లు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ లైఫ్, పీఎంఎస్‌బీఐ, ఏపీవై, ఎస్‌బీఐ జనరల్ వంటి ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలని సూచించారు. అలాగే డిజిటల్ లావాదేవీల కోసం మొబైల్ బ్యాంకింగ్ గురించి అవగాహన కల్పించారు. నగదురహిత లావాదేవీలు సైబర్ మోసాలపై విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. విద్యార్థులు అత్యాశకు పోయి వివిధ యాప్‌ల ద్వారా డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, పరుశరామ్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ బాలకృష్ణ,రాజేష్, విద్యార్థులు, పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు కొనసాగించాలి



అమరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేసిన అమరుల ఆశయాలను కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గాజుల భిక్షపతి అన్నారు. మార్చి 1న ఎమ్మార్పీస్ అమరుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అమరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి, స్థానిక నాయకులు నోముల శ్రీనివాస్, సురేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

రేగొండ : శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రతి నెలలో కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తారు. శుక్రవారం అభిషేకంతో ప్రారంభమై, సుదర్శన నారసింహ హోమం కొనసాగించారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు. ఆరగింపుతో కల్యాణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, చైర్మన్ మాదాడి అనిత, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

కాటారం: అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి మార్చి 3న నిర్వహించే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలియో కార్యక్రమం కోసం చేస్తున్న ఏర్పాట్లపై మండల వైద్య అధికారుల ద్వారా వివరాలు సేకరించారు. మండల వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పాప నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు. కాటారం పీహెచ్‌సీ పరిధిలో 35 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య, ఎంఈఓ దేవనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీణ, అరుణ, ఆయా శాఖల సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదు

మహదేవపూర్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం ఆగదని పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కల్వల్ శరత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీస్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ ద్వారానే అంబేడ్కర్ ఆశయం నెరవేరుతుందన్నారు. ధర్మం గెలవాలంటే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ దండోర ఉద్యమం ప్రారంభించిన తర్వాతే మాదిగల స్థితి బయటకు తెలిసిందన్నారు. ఈనెల 8న మందకృష్ణ మాదిగ గోదావరిఖనికి వస్తున్నందున నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌మాదిగ, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంథని చందు, జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేష్, మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్, ఐదు మండలాల అధ్యక్షులు కేసారపు నరేష్, రాజయ్య, చిరంజీవి, మల్లేష్, ధర్మయ్య, రవి తేజ, సదానందం, రాము,తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయర్ మిషన్ అందజేత



విద్యార్థులకు వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను అందిస్తున్న రాజిరెడ్డి

మల్హర్: మండలంలోని వల్లెకుంట జిల్లాపరిషత్ పాఠశాలలో వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను జిల్లా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అయిత రాజిరెడ్డి విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా రూ.16 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్ మిషన్‌ను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, ప్రేమ్‌కుమార్, నవీన్, శ్రీశైలం, లక్ష్మణ్, సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.